


# బకరా

-పలమనేరు బాలాజి

ఇంటిముందు ఆటో ఆగిన చప్పుడు వినిపించి, వంట గదిలో ఉల్లిపాయలు తరుగుతున్న విశాల చేస్తున్న పనిలో వేగం పెంచింది. కాన్వెంట్ నుంచి పిల్లలు త్వరగా వొచ్చినట్లున్నారే అనుకుంది గోడ గడియారం వైపు చూస్తూ.

స్టౌవ్ అంటించి బాణ్లీ పెట్టి నూనె పోసింది. గేటు చప్పుడు వినిపించేలోగా ఉల్లిపాయలు తరగటం ముగించింది. పోపు వేద్దామనుకునేలోగా తలుపు ధనధనమని చప్పుడైంది.

'వస్తున్నా ఉండరా' అరచింది విశాల. అయినా ఆగకుండా తలుపు చప్పుడవుతూనే ఉంటే స్టౌవ్ ఆఫ్ చేసి, కోపంగా ఒక చేత్తో గరిట పట్టుకుని, మరో చేత్తో తలుపు తీసి బెదిరించటానికన్నట్లు గరిటను గాల్లోకి లేపి ఉరిమి చూసింది.

తీరా చూస్తే వచ్చింది చిరంజీవి, ఇందూ కాదు. ఎవరో అపరిచితులు. ఇద్దరు ఆడవాళ్లు. ముగ్గురు మగవాళ్లు. విశాల ఉగ్రరూపాన్ని చూసి వాళ్లు భయపడిపోయి ఎందుకైనా మంచిదని రెండు అడుగులు వెనక్కువేసి నిలబడి "చిరంజీవి వాళ్లిల్లు ఇదేకదండీ" అనడిగారు.

'అవును' అంది గరిట కిందకు దించి వాళ్ల వైపే అనుమానంగా చూస్తూ.

'మీరెవరు? ఏం కావాలి' దబాయింపుగా అడిగింది విశాల మగవాళ్ల చేతుల్లో ఉన్న దుడ్డు కర్రల్ని చూస్తూ.

వచ్చిన వాళ్లు దొంగలేమో. మాయమాటలు చెప్పి ఇంట్లోపలికి వచ్చి దోచుకుపోయే వాళ్లేమో అనుకుంది విశాల. అయినా అవసరమైతే కారప్పొడి వుంది కదా అని ధైర్యం తెచ్చుకుంది.

ఆడవాళ్లు పట్టుచీరలు కట్టుకుని ఏదో పేరంటానికి వొచ్చినట్లున్నారు. విశాల వైపు పలకరింపుగా నవ్వుతూ చూసారు. కానీ విశాల నవ్వే ప్రయత్నం చెయ్యలేదు. అయినా ఇంకో పదిహేను ఇరవై నిముషాల్లో చిరంజీవి, ఇందూ వచ్చేస్తారు. కుమారస్వామి రావటానికి ఇంకా చాలా సమయం పడుతుంది. ఆయనొచ్చినా చేయగలిగింది, చేసేది ఏం వుండదు. స్కూలు నుంచి చిరంజీవి వచ్చేంత వరకూ వీళ్లను ఆపగలిగితే చాలు. ఆ తర్వాత వీళ్ల పని వాడే చూసుకుంటాడు అనుకుంది విశాల. అయినా ఒకమాట చెప్పి చూద్దాం వినకపోతారా అనుకుంటూ విశాల నోరు తెరచింది.

"ఎవరంటే జవాబు చెప్పరేం. దొంగలైతే ఏడు తర్వాత రండి. అప్పటికి మా ఆయన ఆఫీసునుండి వొచ్చేసుంటారు. ఆయన లేని టైంలో ఇంటి ముందుకు భిక్షగాడైనా, పోస్టుమ్యాన్ అయినా రాకూడదు. ఇంట్లోపలికి దొంగైనా, కుక్కైనా, పిల్లయినాసరే రాకూడదు. అదీ మా వారి రూలు. వెళ్లండి వెళ్లి తర్వాత రండి."

"ఎవరంటే జవాబు చెప్పరేం. దొంగలైతే ఏడు తర్వాత రండి. అప్పటికి మా ఆయన ఆఫీసునుండి వొచ్చేసుంటారు. ఆయన లేని టైంలో ఇంటి ముందుకు భిక్షగాడైనా, పోస్టుమ్యాన్ అయినా రాకూడదు. ఇంట్లోపలికి దొంగైనా, కుక్కైనా, పిల్లయినాసరే రాకూడదు. అదీ మా వారి రూలు. వెళ్లండి వెళ్లి తర్వాత రండి."

వచ్చిన వాళ్లు అయోమయంగా మొహాలు చూసుకున్నారు.

ఒక పట్టుచీర ముందుకు కదిలి "అయినా మేంకదా ఏడవాల్సింది. మీరెందుకు ఏడుస్తున్నారు?" అని అడిగింది.

"నేనా ఏడుస్తున్నానా" అంటూనే చీర కొంగుతో కళ్లు తుడుచుకుంది విశాల. నిజంగానే కళ్లవెంట నీళ్లు కారిపోతున్నాయి. ఉల్లిపాయలు తరగటంవల్ల కళ్లవెంట నీళ్లు వొచ్చుంటాయని అనుకుంటూనే, "అయినా నా ఏడుపు గురించి మీకెందుకండి? మీరేం నాకు చుట్టాలా, స్నేహితులా" అంది వ్యంగ్యంగా.

ఆ మాటతో ఇంకో పట్టుచీర కూడా కదిలి ముందుకొచ్చి అంది. "అదేం వొదినా అలా అంటావు. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు జరగాల్సింది చూడాల్సింది పోయి నడీధిలో మమ్మల్నిలా నిలబెట్టి అవమానిస్తున్నావ్. ఎంతైనా ఇప్పుడు మనం మనం ఒకటి కదా."

ఒక్క ముక్క కూడా అర్థంకాలేదు విశాలకి.

"ఏదో నార పీచు చుట్టరికం పేరుచెప్పి ఇంట్లోకి వచ్చి ఆనక దొంగతనం చేసే దోపిడి ముఠాయే ఇది" అని నిర్ణయించేసుకుంది విశాల.

మగవాళ్లు కూడా నిద్రలో నడుస్తున్న వాళ్లలా తలుపు దగ్గరకొచ్చి నిలబడ్డారు. దాంతో విశాలకు కంగారు ఎక్కువైంది.

"పిల్లల్ని కనగానే సరికాదు. వాళ్లు ఎక్కడికి వెడుతున్నారో ఏం చేస్తున్నారో తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రిదే ఏమంటారు?" బుర్ర మీసాలతను దబాయించినట్లు అడగటంతో విశాలకు క్షణంలో కోపం వచ్చేసింది.

"చూడండి లోపల ఉప్మా మాడిపోతా వుంది. పిల్లల పెంపకం పైన నా అభిప్రాయం తెలుసుకోవాలని మీరు అనుకుంటే, ఆదివారం టీవీలో సీరియల్స్ లేని టైంచూసుకుని రండి. ఇప్పుడు నాకంత టైం లేదు" అంటూనే దడాలున వాళ్ల మొహాలపైన మెరుపు వేగంతో తలుపులు వేసి, వంట గదిలోకి నడిచింది విశాల.

బుర్ర మీసాలతను కెవ్వుమని అరిచాడు. కేకలు పెట్టసాగాడు. అదేం వినపడనట్లు విశాల స్టౌవ్ అంటించి ఉప్మా

చేయడంలో మునిగిపోయింది.

బయటనుండి కేకలు అరుపులు మొదలై చివరికి ఎవరిదో గొంతు ఏడుపు రాగాల్ని పలికించడంతో, మాలతిలో కుతూహలం పెరిగిపోయింది.

"ఇదేదో వెరైటీ టీవీ ప్రోగ్రాంలా వుందే" అనుకుంది. టీవీ వాళ్లు చూపించే విచిత్రమైన కార్యక్రమాలు గుర్తొచ్చాయి.

ఆ ఆలోచన వచ్చిందే తడవుగా బాత్‌రూంలోకి వెళ్లి ఫ్రెషప్ అయి వచ్చింది. తల దువ్వుకుని ముఖం కడుక్కుని, చీర మార్చుకుని అద్దం ముందు కూర్చుని మేకప్ సామగ్రి బయటకు తీసింది.

పది నిముషాల తర్వాత నింపాదిగా వెళ్లి తలుపు ముందు నిలుచుంది. అప్పుడు చూసింది విశాల. ఎవరిదో కాలు తలుపు సందులో ఇరుక్కుని వేలాడుతోంది. ఒక చెప్పు ఇంట్లోపల పడిపోయి వుంది.

కంగారు పడుతూనే తలుపు తెరిచింది. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి విశాల నవ్వాపుకోలేకపోయింది.

తలుపు సందులో ఇరుక్కున్న కాలు బుర్రమీసాలతడిది. కళ్లు తేలేసి వెనక్కి వాలిపోయిన అతగాడు కింద పడిపోకుండా మిగిలిన వాళ్లందరూ చేతులు చాపి అతడ్ని పట్టుకుని వున్నారు. నొప్పితో స్పృహ కోల్పోయిన అతగాడు వాళ్ల చేతులపైన పడుకుని గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. దుడ్డుకర్రలు నేలపైన పడున్నాయి.

విశాల నవ్వగానే వాళ్లందరూ జడుసుకున్నారు. ఎంత భయపడిపోయారంటే అందరూ ఒక్కసారిగా వెనక్కు జరగటంతో చేతులు పట్టుతప్పి, మీసాలతను దబ్బున కింద పడి మళ్లీ కెవ్వుమన్నాడు.

ఎటు చూస్తున్నాడో తెలీదు కానీ మెల్లకన్ను అతను విశాలముందు నిలబడి చేతులు జోడించాడు.

"తల్లీ నీకు పుణ్యం వుంటుంది. ముందా నవ్వు ఆపు తల్లీ నవ్వుతో చంపే వాళ్లని నిన్నే చూస్తున్నాం."

ఆ మాటతో విశాలకు వాళ్లపైన ఉన్నట్లుండి జాలి ముంచుకొచ్చింది.

"ఏమయ్యా పెద్దమనిషీ ఆదివారం రమ్మన్నాకదా. ఇంకా ఇక్కడేం చేస్తున్నారు? ఏదైనా టీవీ ప్రోగ్రామా? ముందుగా చెప్పాలి కదా" ఎందుకైనా మంచిదని జుట్టు సవరించుకుంటూ అంది విశాల. వాళ్లు ఆమె వైపు అయోమయంగా చూసారు.

వీధిలో నిలబడ్డ ఆటోవైపు కూడా పరీక్షగా చూసింది. ఈమధ్య రకరకాల ఛానళ్లు కెమెరాలు దాచిపెట్టి రహస్యంగా 'బకరా' ప్రోగ్రాంలు నిర్వహించి వాటిని టీవీలో ప్రసారం చేయడం లాంటిదేనేమో ఇది కూడా అనిపించింది విశాలకు.

కానీ ఆటోలో కెమెరా లాంటిది కనపడకపోయేసరికి కొంత నిరుత్సాహం కలిగింది.

బుర్రమీసాలతడు లేచి నిలబడి నలిగిపోయిన కాలువైపు దీనంగా చూసుకోసాగాడు.

"పిల్లలన్నాక ఏవో పొరపాట్లు చేస్తారు వొదినా మనమే వాళ్లని సరిదిద్దాలి కదా..." అంటున్న పట్టుచీర వైపు అయోమయంగా చూసింది విశాల.

"వొదినెవరు? ఇంతకూ నువ్వెవరు? అసలిది టీవీ ప్రోగ్రామా కాదా అది చెప్పండి ముందు" నిలదీసింది విశాల.

"టీవీ ప్రోగ్రామా, ఏంది వొదినా" అడిగింది ఇంకో పట్టుచీర.

ఆ మాటతో విశాలకు వచ్చిన పూనకాన్ని చూసి జనం మళ్లీ జడుసుకున్నారు. కోపంతో వణికిపోతూ అరచింది విశాల.

"దొంగలలైతే మర్యాదగా మా ఇంటాయన వచ్చినాక రండి. పిల్లల పెంపకం గురించి నాతో ఇంటర్వ్యూ లాంటిది ఏమైనా కావాలనుకుంటే ఆదివారం రండి.

వీధిలో నిలబడ్డ ఆటోవైపు కూడా పరీక్షగా చూసింది. ఈమధ్య రకరకాల ఛానళ్లు కెమెరాలు దాచిపెట్టి రహస్యంగా 'బకరా' ప్రోగ్రాంలు నిర్వహించి వాటిని టీవీలో ప్రసారం చేయడం లాంటిదేనేమో ఇది కూడా అనిపించింది విశాలకు.

మళ్లీ అంతవరకూ మీ మొహాలు నాకు చూపించకండి. నాక్కోపం వస్తే నేనేం చేస్తానో నాకే తెలీదు. మా ఆయనే నాకు కోపం వచ్చినప్పుడు ఇంట్లోంచి బయటకెళ్లిపోతాడు. ఉంటే పచ్చడైపోతామని ఆయనకి ముందే తెలుసు. మీకు తెలీదు కాబట్టి చెపుతున్నా కదలండిక."

లోపలికి వెళ్లి దఢాలున తలుపు వేసుకుంది విశాల. కాలికేదో అడ్డం పడటంతో కిందకు తల వంచి చూసింది. మీసాలతడి చెప్పు కనిపించింది.

దాన్ని చూడగానే ఆమెకు డోకు వచ్చినంతపనైంది. రంగు, రుచి, వాసన లేని ఇలాంటి దరిద్రపుగొట్టు చెప్పును ఇంతవరకూ నేను చూడనే లేదు అనుకుంటూ, చెప్పు బయటకు విసిరేద్దామనే ఉద్దేశంతో ఉన్నట్లుండి తలుపు తెరచి చెప్పును కాలితో తన్నే ఉద్దేశంతో ఇంట్లోపలికి రెండు అడుగులు వెనక్కు నడిచింది. ఎవరూ ఊహించని సంఘటన ఒకటి అప్పుడే జరిగింది. విశాల తలుపువేయగానే తలుపు ముందు చేరిపోయిన వాళ్లు, తలుపు తీయగానే అందరూ ఒక్కసారిగా ఒకరిపైన ఒకరు పడి ఇంట్లోపలికి పడిపోయారు.

తన కాళ్లవద్ద పడిపోయిన వాళ్లను చూడగానే విశాలకు కోపం ఎగిరిపోయి ఉన్నట్లుండి మళ్లీ నవ్వొచ్చింది. విశాల నవ్వు వినీ వినగానే వాళ్లంతా కంగారుగా లేచి నిలబడి మూకుమ్మడిగా దండం పెట్టారు. నవ్వు ఆపమన్నట్లు తలలు అడ్డంగా ఆడించారు. మీసాలతను తన చెప్పుని వెదికి కాలికి వేసుకున్నాడు.

"అదేం చెప్పో చెప్పు హా... హా... క్రీస్తు పూర్వం నాటిదిలా వుంది. మ్యూజియంలో ఎక్కడైనాకొట్టుకొచ్చావా... మొహం చూడు... నువ్వూ... నీ చెప్పూ... హా... హా..." నవ్వాపుకోలేకపోతోంది విశాల.

మా తాతగారికి తొంబై యేళ్లండి. డెబ్బయి ఏళ్లకింద ఆయనకి ప్రియురాలు కొనిచ్చిన చెప్పులివి. ఆయన ఆమె జ్ఞాపకార్థం మా అవ్వ మరణించినప్పట్నుంచి వేసుకుంటున్నాడు. ఇక్కడికి వచ్చేముందు ఇహిహి ఇహీహీ... నా చెప్పుల్ని కుక్కలు ఎత్తుకుపోతేనూ సైజు ఒకటే కదాని... ఇహీహీ... ఆయన చెప్పుల్ని ఏసుకొచ్చేసానండి హడావిడిలో... హీహీ" పళ్లు ఇకిలించాడు మీసాలతడు.

"అదేం వొదినా మీ అబ్బాయి మా అమ్మాయిని ప్రేమించాడు కాబట్టి ఈడికి రమ్మన్నాడు కాబట్టి వొచ్చాం. నువ్వేందో నవ్వినవ్వి మా ప్రాణాలు తీసేటట్టున్నారే" అందొక పట్టుచీర లౌక్యంగా నవ్వుతూ.

వెర్రి దానిలా చూస్తూ విశాల "మిమ్మల్ని మా అబ్బాయి రమ్మన్నాడా" అడిగింది.

"అవునమ్మా అక్షరాలా మీ అబ్బాయే. గొడవలేమైనా జరుగుతాయేమోనని ఆయనే మమ్మల్ని కర్రల్ని కూడా తెచ్చుకోమన్నాడు" మెల్లకన్నతను అనేసి నాలుక కరుచుకున్నాడు.

పట్టుచీరలు అతడ్ని ఉరిమి చూసాయి.

ఇంతలో ఇంటిముందు ఆటో ఆగింది. కాన్వెంట్ నుండి చిరంజీవి, ఇందూ ముఖాలు వేలాడేసుకుని వచ్చారు.

'ఏరా చిరంజీవి వీళ్లు నీకు తెలుసా' అని అడిగింది విశాల వస్తున్న నవ్వు ఆపుకుంటూ.

తల అడ్డంగా ఆడించి టీవీ ఆన్ చేసాడు చిరంజీవి. 'ఏ క్లాసండి' పహిల్వాన్‌లా కనిపిస్తున్న కుర్రాడ్ని ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు మెల్లకన్నతడు,

"ఐదో తరగతి!"

"చిరంజీవి వాళ్లిల్లు అనడిగితే మీ ఇల్లు చూపించారే వీధిలో వాళ్లు" అయోమయంగా గొణిగిందొకావిడ.

విశాలకి అప్పటికి విషయం పూర్తిగా అర్థమైంది.

"మీ చిరంజీవిది పక్కిల్లు."

నోరు తెరిచేసారు అందరూ. వాళ్ల మొహాలు ఫ్యూజు పోయిన బల్బుల్లా అయిపోయాయి. వాళ్లనలా చూడగానే విశాలకు నవ్వొచ్చేసింది. టీవీలో ఏదో చూస్తూ చిరంజీవి నవ్వాడు. అంతే! ఇద్దరి నవ్వుతో కళ్లు తిరిగి దబ్బున కిందపడ్డారు అందరూ. ★

## తేనీటి ప్రియులు!

మన హైదరాబాద్‌లో రోజుకు కనీసం నాలుగైదు కప్పులు ఇరానీ చాయ్ తాగందే చాలా మందికి నిద్ర పట్టదు. తేనీరు అంటే మనుషులకే కాదు జంతువులకు కూడా ఇష్టం లాగుంది. ఈ ఫోటో చూస్తే మీకే అర్థమవుతుంది. లక్నోలోని ఓ హోటల్‌లో టేబుల్ ఉంచిన టీని సర్వర్ తిరిగి చూసే లోగానే తాగేసి మూతి తుడిచేసుకుంటున్న ఈ అల్లరి ఓ ముంగిస జంటది.

